క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం 33/11 కేవీ వెల్లంకి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట గ్రామాలలో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కొమ్మాది: మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్, గాయత్రి ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం నియో విజన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమ విగ్రహ ప్రతిష్ట



హనుమ విగ్రహం వద్ద స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు కొండపేట పంప్‌హౌస్ రోడ్డులో శుక్రవారం స్థానికులు హనుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరై హనుమను దర్శించుకున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి తల్లికి ఆర్థికసాయం అందిస్తున్న రాజు స్నేహితులు

తగరపువలస: పద్మనాభం మండలం పొంద్రంగి పంచాయతీ సామియ్యవలస గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రౌతు రాజు అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందాడు. అతని తండ్రి కృష్ణ కూడా లారీ డ్రైవరే. ఆయన కూడా అనారోగ్యం కారణంగా కొన్నేళ్లుగా ఇంటికే పరిమితమయ్యారు. దీంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న భీమిలి మండలం మజ్జివలస గ్రామానికి చెందిన ఎన్టీఆర్ యూత్ అసోసియేషన్ సామియ్యవలస కింగ్స్ ద్వారా రాజు తల్లి లక్ష్మికి శుక్రవారం రూ.25,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లంక శ్రీను, రౌతు గోవింద్, పిన్నింటి రాజు, సురేష్, నవీన్, పల్లి సాయి, అవినాష్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం



విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కలిగిస్తున్న లక్ష్మి

తగరపువలస: చిన్ననాటి నుంచి ధ్యానం అలవాటు చేసుకోవడం వలన మానసిక ఒత్తిడి తగ్గి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందవచ్చని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి లక్ష్మి తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో తాళ్లవలస జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు ధ్యానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ధ్యానంతో పాటు చదువు, ఆటలు, పాటలు, సంప్రదాయాల గొప్పదనం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మి, సంతోషి, చంద్రశేఖర్, ఫణి, మీనా, కోటేశ్వరి పాల్గొన్నారు.

మరుగు లేక..

పరిసరాల పరిశుభ్రతకే కాదు ఆరోగ్యానికీ, ఆత్మగౌరవానికీ కూడా సంబంధించిన అంశం మరుగుదొడ్లు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు కొంతవరకు ఆ సమస్యను తీరుస్తున్నాయి. అయితే, సరైన నిర్వహణ లేక పబ్లిక్ టాయిలెట్లు మూలకు చేరడంతో చిట్టివలస పెరికివీధి వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఆరుబయట వెళ్లడానికి సిగ్గుపడుతూ.. వేరే అవకాశం లేక నాలుగు నెలలుగా నరకం చూస్తున్నారు.



వ్యక్తిగత టాయిలెట్లు లేని బెంగాలీ క్వార్టర్స్

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు పరిధి చిట్టివలస పెరికివీధిలో పబ్లిక్ టాయిలెట్లు నాలుగు మాసాలుగా నిరుపయోగంగా ఉన్నాయి. సరైన నిర్వహణ, విద్యుత్ సరఫరా, రన్నింగ్‌వాటర్ సదుపాయాలు లేకపోవడంతో ఇవి మూలకు చేరాయి.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా నాలుగేసి టాయిలెట్లు నిర్మించారు. ఇవి పెరికివీధి, కళ్లాలు, జ్యూట్‌మిల్లుకు చెందిన బెంగాలీ క్వార్టర్స్, క్రిస్టియన్ పేట, కిలుముపేట, బొగ్గురోడ్డు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేవి. ఈ టాయిలెట్లను ఆనుకుని కోనేరు, పెద్ద చెరువు ఉన్నాయి.



నాచు పేరుకుపోయిన టాయిలెట్లలో నీటి కుండీ

ప్రస్తుతం ఈ టాయిలెట్లు వినియోగంలో లేకపోవడంతో స్థానికులు చెరువు, కోనేరులను బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. చీకటి పడితే అక్కడికి వెళ్లాలన్నా కూడా భయంతో వెనకడుగు వేస్తున్నారు. వ్యక్తిగత టాయిలెట్లు లేని సుమారు వందమందికి పైగా ప్రజలకు ఈ పబ్లిక్ టాయిలెట్లు



నిర్వహణ, రన్నింగ్ వాటర్, విద్యుత్ లేక పనిచేయని టాయిలెట్లు

అవసరం.. అయినా కూటమి నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మళ్లీ మొదటికే..

గతంలో ఈ ప్రాంతంలో వ్యక్తిగత టాయిలెట్లు పూర్తిగా లేకపోవడంతో స్థానికులు బొగ్గురోడ్డు, చెరువు, కోనేరు, వ్యవసాయ భూములు, గోస్తనీనది పూనిగట్టు ప్రాంతాలను బహిరంగ మల విసర్జనకు వినియోగించేవారు. దీంతో స్వచ్ఛభారత్



తలుపులు, పైపులు ఊడిపోయిన టాయిలెట్లు

కార్యక్రమంలో భాగంగా భీమిలి జోన్‌లో వివిధ గ్రామాలతో పాటు పెరికివీధిలో కూడా పబ్లిక్ టాయిలెట్లు నిర్మించారు. ప్రస్తుతం పెరికివీధి, కొండపేట, రామన్నపేట, బంగ్లామెట్ట ప్రాంతాలలోనూ పబ్లిక్ టాయిలెట్లు నిర్వహణ, రన్నింగ్ వాటర్, విద్యుత్ సరఫరా లేక మూతపడ్డాయి. వీటిలో పెరికివీధి వాసులకు పబ్లిక్ టాయిలెట్లు అత్యవసరమైనా అందుబాటులో లేకపోవడంతో మళ్లీ బహిరంగ మల విసర్జనకు ఇక్కడి వారు అలవాటు పడ్డారు.



విరగ్గొట్టిన టాయిలెట్ల లోపలి భాగాలు

అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

టాయిలెట్లు నిరుపయోగం కావడంతో వాటి ఆవరణ, లోపల తుప్పలు మొలిచి విషపురుగులకు ఆవాసంగా మారిపోయాయి. టాయిలెట్లకు ప్రహరీ ఉండటంతో ప్రస్తుతం ఆకతాయిలు ఈ ఆవరణను పేకాట తదితర అసాంఘిక చర్యలకు వినియోగిస్తున్నారు.



ఆకతాయిలకు వేదికగా టాయిలెట్ల ఆవరణ

చాలా ఇబ్బంది



మాకు వ్యక్తిగత టాయిలెట్లు లేవు అని చెప్పుకోవడానికి బాధ పడుతున్నాను. కనీసం పబ్లిక్ టాయిలెట్లు వినియోగంలో ఉంటే కొంత ఉపయోగంగా ఉంటుంది. ఆరుబయటకు వెళ్లాలంటే చాలావరకు ఇక్కడి వారు సిగ్గుతో చచ్చిపోతున్నారు. టాయిలెట్లను పునరుద్ధరించాలి.

– బూసర కాంతం, చిట్టివలస

తీవ్రమైన సామాజిక సమస్య



టాయిలెట్ల సౌకర్యం కల్పించలసిన బాధ్యత స్థానిక సంస్థలది. సొంత ఇల్లు ఉంటే ప్రభుత్వం ఇచ్చే రుణంతో నిర్మించుకోగలరు. సొంత గూడు లేని వారు టాయిలెట్లు ఎలా నిర్మించుకోగలుగుతారు. తీవ్రమైన సామాజిక సమస్యగా గుర్తించి పెరికివీధి టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– కాళ్ల పురుషోత్తం, చిట్టివలస

ఆరుబయటకు వెళ్లలేక..



ఇక్కడి టాయిలెట్లు నిరుపయోగంగా మారడంతో స్థానికులు నరకం చూస్తున్నారు. ఆరుబయటకు వెళ్లలేక .. అలాగని ఆగలేక చాలా ఇబ్బంది పడుతున్నారు. పోనీ చీకటి పడిన తర్వాత వెళ్దామంటే వ్యవసాయ భూములు, చెరువులు, కోనేటి వెంట విషపురుగుల బెడద ఉంది. త్వరితగతిన సమస్య పరిష్కరించాలి.

– జీరు ప్రతాపరెడ్డి, చిట్టివలస

ఎవరూ పట్టించుకోవడం లేదు



నాలుగు నెలలుగా టాయిలెట్లకు రన్నింగ్ వాటర్, కరెంటు లేవు. శుభ్రం చేయకపోవడంతో లోపలికి అడుగు పెట్టలేకపోతున్నాం. ఆకతాయిలు ఎక్కడికక్కడ తలుపులు, గోడలు విరగ్గొట్టారు. జీవీఎంసీ ఇప్పటికైనా మరమ్మతులు చేయించాలి.

– కిలుము గోవిందరెడ్డి, చిట్టివలస

బ్యాంక్ ఉద్యోగుల ఆందోళన

తగరపువలస: షెడ్యూల్ బ్యాంకుల్లో పనిచేస్తున్న సిబ్బందికి వారంలో అయిదురోజుల పనిదినాలను అమలు చేయాలని చిట్టివలస ఎస్‌బీఐ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ జి.లితేష్ డిమాండ్ చేశారు. బ్యాంకు ఆవరణలో వివిధ బ్రాంచ్‌ల సిబ్బంది శుక్రవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో మాట్లాడారు. వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించి అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో చేపట్టనున్న సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

వసతిగృహ పునర్నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీడీ రామారావు

తగరపువలస: చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం పునర్నిర్మాణ పనులను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు శుక్రవారం పరిశీలించారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.70 లక్షల సామాజిక సేవా నిధులతో వసతిగృహాన్ని పునర్నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించిన డీడీ పలు సూచనలు చేశారు. నాణ్యమైన మెటీరియల్‌తో చేపట్టిన తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్, సీలింగ్ బాగున్నాయన్నారు. ఆయనతో పాటు దివీస్ సామాజిక సేవ అధికారులు డి.సురేష్‌కుమార్, పి.శేఖర్‌బాబు, వార్డెన్ రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ కాలేజీ రోజులు, వేడుకలు విద్యార్థులకు మంచి జ్ఞాపకాలుగా మిగులుతాయన్నారు. పరీక్షలు సమీపించినందున విద్యార్థులందరూ బాగా చదువుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక పెద్దలు మైలిపల్లి షణ్ముఖరావు, లక్ష్మణరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషతో మనోవికాసం



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

- డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి
- ఘనంగా మాతృభాషా దినోత్సవం

భీమునిపట్నం: మాతృభాష తల్లివంటిదని, దానిని ఎంతో గౌరవించుకోవాలని భీమిలిలోని జిల్లా విద్య శిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉంటున్నా మన తల్లి భాషను ఏమాత్రం విస్మరించకూడదన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా డైట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతృభాషతోనే మనోవికాసం కలుగుతుందన్నారు. ముఖ్యంగా మన మాతృభాష తెలుగు అమృతం వంటిదన్నారు. మన పిల్లలకు మాతృభాష ఆవశ్యకత, గొప్పదనం గురించి వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు మాతృభాష గొప్పదనం గురించి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు జి.జి.ఎస్.నాగేశ్వరరావు, గొట్టేటి రవి, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, సి.ఎ.సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి

మాతృభాషను కాపాడుకోవాలి

మన సంస్కృతీ సంప్రదాయాలు, నడవడిక మొదలైనవి పూర్తి స్థాయిలో కొనసాగడానికి మాతృభాష పరిరక్షణ ఎంతో అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి అన్నారు. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన భాష గొప్పదనం గురించి పిల్లలకు వివరించి చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ, అధ్యాపకులు సహదేవుడు, శ్రీనివాస్, సాగర్, మాధురి, వెంకటరావు పాల్గొన్నారు.

మాతృభాషను మరవొద్దు

తగరపువలస: ప్రపంచానికి మనల్ని పరిచయం చేసిన మాతృభాషను ఎవరూ మరచిపోవద్దని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల తెలుగు భాషా ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు చెప్పిన మాటలను గుర్తు చేశారు. మాతృభాషతో పాటు సౌలభ్యం కొరకు ఇతర భాషలు నేర్చుకోవడం తప్పు కాదన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహనీయులు గురజాడ, గిడుగు, సీపీ బ్రౌన్, కందుకూరితో పాటు భరతమాత వేషధారణలో చిన్నారులు అలరించారు. తెలుగులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు సహస్ర, భాగ్యశ్రీ హర్షిత, లాస్య, తరుణ్ తేజ, జోషిత సోనాక్షి, జ్ఞానసంహితలను బహుమతులతో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుగత మల్లిక, ఈగల సంజీవి, స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.



తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిన మహనీయుల వేషధారణల్లో చిన్నారులు

రైతుల నుంచి టమాటా కొనుగోలు



అనంతవరంలో టమాటా పంటను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాస్ కిరణ్

పద్మనాభం: టమాటా ధరలు పడిపోయినందున రైతుల నుంచి మార్కెటింగ్ శాఖ టమాటాలు కొనుగోలు చేస్తోందని మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాస్ కిరణ్ తెలిపారు. మండలంలోని కొవ్వాడ, అనంతవరం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన టమాటా తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కిరణ్ మాట్లాడుతూ మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం కింద రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసిన టమాటా పంటను రైతు బజార్లలో అమ్మేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు బజారు గుర్తింపు కార్డులు లేకపోయినా రైతులే నేరుగా రైతు బజారుల్లో అమ్ముకునేందుకు మార్కెటింగ్ శాఖ సహకారం అందిస్తుందన్నారు. పద్మనాభం, ఆనందపురం, భీమునిపట్నం మండలాల్లో టమాటా పంట పండించే రైతులు ఇంటర్ వెన్షన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు రైతులు భీమునిపట్నం మార్కెట్ కమిటీ అధికారులను లేదా గ్రామ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట భీమునిపట్నం మార్కెట్ కమిటీ కార్యదర్శి బి.లక్ష్మి చైతన్య ఉన్నారు.

నేటి నుంచి మద్దిలో పశువుల వారపుసంత



మద్దిలో సంత నిర్వహించనున్న స్థలం

పద్మనాభం: మండలంలోని మద్దిలో ఈ నెల 22 నుంచి ప్రతి శనివారం పశువుల సంత నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుగత అప్పలనాయుడు తెలిపారు. సాగర దుర్గ, అయ్యప్ప స్వామి ఆలయాల సమీపంలోని సుమారు రెండెకరాల స్థలంలో ఈ సంత నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సంతలో గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, ఎడ్లు, కోళ్లను తీసుకువచ్చి క్రయ విక్రయాలు చేసుకోవచ్చన్నారు. వీటి కోసం 20పందిళ్లను నిర్మించామన్నారు. సంతలో ఎటువంటి ఆశీలు వసూలు చేయబోమని చెప్పారు.

మర్యాదపూర్వక కలయిక



చిన్న శ్రీనుకు కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్ర పటాన్ని బహూకరిస్తున్న మారుతీ ప్రసాద్

కొమ్మాది: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన వంకాయల మారుతీ ప్రసాద్ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీనును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, ధన్యవాదాలు తెలిపారు. ఆయనకు కనకమహాలక్ష్మి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. చిన్న శ్రీనును కలిసిన వారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్లేశ్వరి, అప్పారావు, సత్యనారాయణ తదితరులున్నారు.

పశు వైద్యశాలల ఆకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జేడీ రామకృష్ణ

పద్మనాభం: మండలంలోని రెండు పశు వైద్యశాలలను ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.రామకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెడ్డిపల్లి, పద్మనాభం పశు వైద్యశాలలల్లో స్టాకు రిజిస్టర్లు, సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సకల సద్గుణ సంపన్నుడు హనుమ

మధురవాడ: దేవతలందరి అనుగ్రహంతో కూడిన సకల శక్తి సంపన్నుడు స్వామి హనుమ అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గొప్ప ఆత్మవిశ్వాసం, ఉత్సాహం, వినయం వంటి సుగుణాలు కలిగిన హనుమతో సమానమైన బలవంతుడు ఇంకెవరూ లేరని పేర్కొన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ రామాయణంపై నిర్వహిస్తున్న ప్రవచనాల్లో భాగంగా కిష్కింధకాండపై ఆఖరిరోజు ప్రవచనాన్ని శుక్రవారం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి హనుమకు శాపవిమోచనమైన ఘట్టం శ్రీరామాయణంలోని అత్యంత మంగళప్రదమైన ఘట్టమని చెప్పారు. హనుమ బల పరాక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ దంపతులను చాగంటి కోటేశ్వరరావు, నిర్వాహకులు సత్కరించారు.

అంధకారంలో తాళ్లవలస జాతీయ రహదారి



తాళ్లవలస జాతీయ రహదారిపై అంధకారం

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై చీకట్లు కమ్ముకున్నాయి. అగ్నిమాపక కేంద్రం నుంచి పశువుల ఆస్పత్రి వరకు జాతీయ రహదారితో పాటు ఇరువైపులా సర్వీస్‌రోడ్లపై లైట్లు కూడా వెలగడం లేదు. ఆనందపురం నుంచి తాళ్లవలస వైపు వచ్చే జాతీయరహదారి పల్లంగా ఉండటంతో పాటు మలుపులతో కూడి ఉంటుంది. దీంతో ఇక్కడ వాహనాలు వేగంగా వస్తూ, అదుపు తప్పుతుంటాయి. చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువ. అధికారులు స్పందించి వెంటనే విద్యుద్దీపాలు పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.